సాక్షి జగిత్యాల

శనివారం । 1 । జూలై । 2023



కొనసాగుతున్న పారాయణం

జగిత్యాలటౌన్: సోమవారం షిరిడీసాయి మందిరంలో ప్రారంభమైన సాయినాథ చరిత పారాయణం ఐదోరోజు కొనసాగింది.



సాయిచంద్‌కు నివాళి

ఇబ్రహీంపట్నం : తెలంగాణ ఉద్యమ గాయకుడు సాయిచంద్‌కు శుక్రవారం స్థానికులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు.

గరిష్టం/కనిష్టం 34.0/26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

జగిత్యాలజోన్: మున్నూరు కాపుల సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకులు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో దావ వసంతను కలిశారు. విద్యార్థులకు గ్రంథాలయం, హాస్టల్, కమ్యూనిటీహాల్ నిర్మాణం కోసం జిల్లా కేంద్రంలో స్థలం కేటాయించాలని వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తానన్నారు. హరి అశోక్‌కుమార్, సమిండ్ల శ్రీనివాస్, మల్లికార్జున్, రాజిరెడ్డి, వెంకట్, సత్యం, గంగాధర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

వసంతను కలిసిన డీఎస్పీ

ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందిన పోలీసు అధికారి రాజశేఖర్‌రాజు శుక్రువారం జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంతను కలిశారు. ఆమె డీఎస్పీకి శుభకాంక్షలు తెలిపారు.

ఎన్ఆర్ఐ పాలసీ ఏర్పాటు చేయాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం రూ.500కోట్లతో ఎన్ఆర్ఐ పాలసీ ఏర్పాటు చేయాలని గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక దమామ్ ఇన్‌చార్జి బాలసాని లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం సౌదీలోని దమామ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరాయిదేశంలో వలస కార్మికులు అనారోగ్య సమస్యలు, పని ఒత్తిడి, రోడ్డు ప్రమాదాలు, వేతనబాధలు వంటి సమస్యలతో సతమతమవుతూ మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. వలసజీవుల వెతలు తీర్చేందుకు బడ్జెట్ సమావేశాల్లో ఎన్ఆర్ఐ పాలసీపై విధాన నిర్ణయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. వేదిక దమామ్ కో ఆర్డినేటర్లు బోగ శ్రీనివాస్, నాలాపోరం నవీన్, చిట్యాల కృష్ణ, మచ్చర్ల ఆదిరెడ్డి, తిరుపతి, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం



నిర్మానుష్యంగా మారిన మెయిన్ రోడ్డు

ధర్మపురి: గోవధ నిషేధించాలనే డిమాండ్‌తో విశ్వహిందూ పరిషత్ నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు పట్టణంలో శుక్రవారం బంద్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వర్తక, వ్యాపారాలు, ప్రైవేట్ పాఠశాలలు, పాన్‌షాపులు, హోటళ్లు, పెట్రోల్‌బంక్‌లు స్వచ్ఛందంగా మూసివేశారు. జన సంచారం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీస్‌లు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.


నృసింహుని ఆదాయం రూ.60.96లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి హుండీని శుక్రవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. గత మార్చి 24 నుంచి శుక్రవారం వరకు చేపట్టిన లెక్కింపులో రూ.60,96,035 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాస్ తెలిపారు. నగదుతోపాటు 53 గ్రాములు మిశ్రమ బంగారం, 9.850 కిలోల మిశ్రమ వెండి, 52 విదేశీ కరెన్సీ నోట్లు సమకూరాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, రెనోవేషన్ కమిటీ సభ్యులు రామన్న, గందె పద్మ గునిశెట్టి రవీందర్, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంచనాల్లేని అక్రమాలు!



ఇక్కడ కనిపిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ మన్నెగూడెం సబ్‌స్టేషన్ పరిధి భీమారం మండలం దేశాయిపేట గ్రామంలోనిది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఇంతకు ముందు ఓ ఇంటికి దగ్గర ఉండేది. కాస్త ప్రమాదకరంగా ఉన్నప్పటికీ ఉన్నతాధికారులకు తెలపకుండా ఎలాంటి అనుమతులు, అంచనాలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చి సుమారు రూ.2 లక్షల విలువైన పనులు పూర్తి చేశారు. ఇదే రీతిలో కమ్మరిపేట గ్రామంలోనూ ఎలాంటి అనుమతులు లేకుండా ఓ ట్రాన్స్‌ఫార్మర్ మార్చారు.



మన్నెగూడెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్

- ట్రాన్స్‌కో మాయ!
- అనుమతులు లేకుండా తరలింపు
- అడ్డగోలుగా స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల షిఫ్టింగ్
- చర్యలకు నివేదించినా ఫలితం శూన్యం

కోరుట్ల: సాధారణంగా చిన్నపాటి విద్యుత్ వైర్‌ను ఓ స్తంభం నుంచి మరో స్తంభానికి మార్చాలంటే శాఖాపరమైన అంచనాలు.. అనుమతుల పేరిట కాలయాపన చేసే విద్యుత్‌శాఖ అధికారులు.. ఎలాంటి అనుమతి లేకుండా పనులు పూర్తిచేయడం సందేహాలకు తావిస్తోంది. అనుమతి లేకుండా అడ్డగోలుగా ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ లైన్ షిఫ్టింగ్‌లు చేసి తర్వాత విషయం బయటకు పొక్కితే అంచనాలు వేసి బిల్లు తీసుకోవడం .. లేకుంటే వినియోగదారుల నుంచి అందినంత దండుకోవడం జిల్లాలోని కొంత మంది విద్యుత్ శాఖ అధికారులకు షరామామూలుగా మారింది.

నిబంధనలు బేఖాతర్

- షాపులు, పరిశ్రమలకు అత్యవసరంగా విద్యుత్ కనెక్షన్ కోసం, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, ఇదివరకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల షిఫ్టింగ్ వంటి పనుల కోసం తప్పకుండా శాఖాపరమైన అనుమతులు తీసుకోవాలి.
- షిఫ్టింగ్ లేదా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం వినియోగదారుడు విద్యుత్ శాఖ అధికారులు వేసిన అంచనాల ప్రకారం ముందుగానే డబ్బు చెల్లించాలి.
- అనుమతుల విషయంతో కాస్త కాలయాపన జరగడంతోపాటు శాఖాపరమైన అంచనాలతో పనులు చేస్తే విద్యుత్ శాఖకు రూ.లక్షల్లో డబ్బులు కట్టాల్సి ఉంటుందని చెప్పి.. తమకు ఎంతోకొంత ముట్టచెబితే ఆ పని ఎలాంటి అనుమతులు లేకుండానే చేసి పెడుతున్నారు.
- ఇలా అనుమతులు లేకుండా పనులు చేయడానికి తమ సబ్‌స్టేషన్ పరిధిలో అక్కడక్కడా మిగిలి ఉన్న విద్యుత్ వైర్, స్తంభాలు వినియోగించి తాము చెప్పినట్లు వినే కాంట్రాక్టర్ల అండతో పనులు పూర్తిచేస్తున్నారు.
- ఇదేక్రమంలో కోరుట్ల విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని మన్నెగూడెం గ్రామశివారు సబ్‌స్టేషన్ కిందకు వచ్చే దేశాయిపేట, కమ్మరిపేట గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల షిఫ్టింగ్ పనులు పూర్తిచేసినట్లు తెలిసింది.
- ఇలా గుట్టుచప్పుడు కాకుండా జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల షిఫ్టింగ్ జరుగుతున్నట్లుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- అనుమతి, అంచనాలు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, షిఫ్టింగ్ పనులు చేయడానికి కొంతమంది సిబ్బంది తెగబడటంతో విద్యుత్‌శాఖ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతోంది.
- ఏడాదిన్నర వ్యవధిలో ఇలా తప్పుడు పనులకు పూనుకున్న కొంతమంది విద్యుత్ సిబ్బందిని ఉన్నతాధికారులు కేవలం బదిలీలు చేసి సరిపెట్టడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

తప్పు జరిగినా చర్యలేవి?

మన్నెగూడెం సబ్‌స్టేషన్ పరిధి దేశాయిపేటలో అనుమతులు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ జరిగిన విషయంలో కోరుట్ల సబ్‌డివిజన్ అధికారి, డివిజనల్ అధికారి విచారణ చేయాలని కోరుతూ ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు తెలిసింది. సదరు లేఖలో దేశాయిపేటలోని ఎస్ఎస్.49/15 కేవీఏ డీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను అనుమతి లేకుండా ఎలా షిఫ్ట్ చేశారని మన్నెగూడెం సబ్‌స్టేషన్ ఏఈకి జూన్ 7న కోరుట్ల రూరల్ సబ్ డివిజన్ అధికారి(ఏడీఈ) సంజాయిషీ కోరుతూ మెమో ఇచ్చినట్లు తెలిసింది. దీనికి బదులు సదరు ఏఈ తాను లేనిసమయంలో కాంట్రాక్టర్ పనులు చేశారని వివరణ ఇచ్చి తప్పుకునే ప్రయత్నం చేసినట్లు సమాచారం. ఈ విషయమై మెట్‌పల్లి డివిజన్ డీఈ సైతం అవసరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ జూన్ 15న ఎస్ఈకి లేఖ రాసినా చర్యలు శూన్యం. ఇదే తీరు కొనసాగితే అక్రమార్కుల అడ్డగోలు సంపాదనకు అవకాశం చిక్కి విద్యుత్ శాఖ ఆదాయానికి గండి పడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

చర్యలు తీసుకుంటాం

"మన్నెగూడెం సబ్‌స్టేషన్ పరిధిలోని దేశాయిపేటలో జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ పనులపై ఉన్నతాధికారుల విచారణ పెండింగ్‌లో ఉంది. ఈ విషయమై ఉన్నతాధికారుల నుంచి నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటాం.

– సత్యనారాయణ, ఎస్ఈ, జగిత్యాల

గ్రూప్‌-4 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- 21వేల మంది అభ్యర్థులు.. 73 కేంద్రాలు
- నేడు ఉదయం 10గంటల నుంచి పరీక్ష

జగిత్యాల: జిల్లాలో శనివారం నిర్వహించే గ్రూప్‌-4 పరీక్షకు అధికారులు అన్నిఏర్పాట్లు చేశారు. ఇప్పటికే అన్నిశాఖల అధికారులతో కలెక్టర్ యాస్మిన్‌బాషా సమావేశాలు నిర్వహించి పలు సూచనలు జారీచేశారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు, షూలు వేసుకు రావద్దని సూచించారు. మహిళా అభ్యర్థులు విలువైన ఆభరణాలు ధరించి పరీక్షకు రావొద్దన్నారు. ప్రతీ అభ్యర్థి ఒరిజినల్ హాల్‌టికెట్‌తోపాటు, ఒరిజినల్ గుర్తింపు కార్డు తప్పకుండా తీసుకురావాలని పేర్కొన్నారు.

జిల్లాలో 73 కేంద్రాలు..

జిల్లాలో 21,937 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని అధికారులు తెలిపారు. వీరికోసం జిల్లా వ్యాప్తంగా 73 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలో 27, జగిత్యాల రూరల్‌లో 7, మెట్‌పల్లిలో 11, కోరుట్లలో 20, రాయికల్‌లో 4, మల్యాలలో 2, కొడిమ్యాలలో 1, గొల్లపల్లిలో 1 పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.



కోరుట్ల కళాశాలలో అధికారుల ఏర్పాట్లు

ఉదయం 8 గంటల నుంచి అనుమతి..

ఉదయం 8 గంటల నుంచి ఉదయం 9.45 వరకు, మధ్యాహ్నం 1 గంటల నుంచి మధ్యాహ్నం 2.15 వరకు పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థులను అనుమతిస్తామని అధికారులు తెలిపారు. పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందే మెయిన్‌గేట్ మూసివేస్తారు. గడువు ముగిశాక ఎట్టి పరిస్థితుల్లోనూ పరీక్ష హాల్‌లోకి అనుమతించరు. అభ్యర్థులు తప్పకుండా హాల్‌టికెట్, ఫొటో, సంతకం పరిశీలన చేసుకోవడంతోపాటు, హాల్‌టికెట్‌పై ఫొటో సరిగా లేకపోతే గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరి చేయించాలి. అభ్యర్థి ఓఎంఆర్ షీట్‌పై ఉన్న సూచనలు చదవాలి. హాల్‌టికెట్ నంబరు, ప్రశ్నపత్రం నంబరు సరిగా నమోదు చేయాలి. ప్రింటింగ్ లోపాలు ఉంటే వెంటనే ఇన్విజిలేటర్‌కు సమాచారం ఇవ్వాలి.

సకాలంలో చేరుకోవాలి



గ్రూప్‌-4 పరీక్షకు జిల్లావ్యాప్తంగా అన్ని ఏర్పాట్లు చేశాం. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలి. విలువైన ఆభరణాలు, షూస్ వేసుకుని రావద్దు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం.

– యాస్మిన్ బాషా, కలెక్టర్

కోరుట్ల పరిధిలో..

కోరుట్ల: కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో శనివారం జరిగే గ్రూప్‌- 4 పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆర్డీవో వినోద్ కుమార్ తెలిపారు. కోరుట్లలో 5,184 మంది, మెట్‌పల్లిలో 3,744 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని పేర్కొన్నారు. వీరికోసం కోరుట్లలో 20, మెట్‌పల్లిలో 11 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 8 రూట్లు ఏర్పాటు చేశామని, ఒక్కో రూట్‌కు చీఫ్ సూపరింటెండెంట్ ఆఫీసర్, లైసన్ ఆఫీసర్‌ను నియమించామని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఆయన తెలిపారు.

'మెట్‌పల్లి'లోనే ఉంటాం

- ఐదు గ్రామాల ప్రజల డిమాండ్
- పట్టణంలో భారీ ర్యాలీ



మెట్‌పల్లి పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐదు గ్రామాల ప్రజలు

మెట్‌పల్లి(కోరుట్ల): 'మా గ్రామాలను కొత్త మండలం బండలింగాపూర్‌లో కలపవద్దు.. మెట్‌పల్లిలోనే కొనసాగించాలి' అనే డిమాండ్‌తో జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని ఐదు గ్రామాల ప్రజలు శుక్రవారం మెట్‌పల్లిలో కదం తొక్కారు. ఆత్మకూర్, ఆత్మనగర్, రాంలచ్చక్కపేట, జగ్గాసాగర్, పాటిమీది తండా గ్రామాలను కొత్తగా ఏర్పాటు చేస్తున్న బండలింగాపూర్ మండలంలో చేర్చూతూ ప్రభుత్వం ఇటీవల ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసింది. దీనిని నిరసిస్తూ ఆయా గ్రామాలకు చెందిన సుమారు మూడు వేల మంది స్థానిక మార్కెట్‌యార్డుకు తరలివచ్చారు. అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా బయలు దేరి వెళ్లారు. పాత బస్టాండ్, కొత్త బస్టాండ్‌ల మీదుగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్తుండగా, సమీపంలో జాతీయ రహదారిపైనే పోలీసులు వారిని నిలిపివేశారు. కార్యాలయంలోకి అందరూ కాకుండా కొందరు వెళ్లి వినతిపత్రం ఇవ్వాలని సూచించారు. దీనికివారు అంగీకరించలేదు. తామంతా వెళ్లి వినతిపత్రం ఇస్తామని పట్టుబట్టారు. గత్యంతరం లేక పోలీసులు అనుమతి ఇవ్వగా, కార్యాలయం వద్దకు వెళ్లి బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామాలను బండలింగాపూర్‌లో చేర్చితే అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. గ్రామాల నుంచి బండలింగాపూర్ వరకు రవాణా సౌకర్యం లేదని తెలిపారు. మెట్‌పల్లి తమకు అన్ని విధాలా అనుకూలంగా ఉందని తెలిపారు. తమను అందులోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఆ తర్వాత ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆర్డీవో వారికి తెలిపారు. ర్యాలీ సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీఐ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విషాదం.. విచారం..



రోదిస్తున్న రజిత బంధువులు, మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

పుట్టింట్లో ఉండలేక.. భర్త వద్దకు వెళ్లలేక..

సిరిసిల్లక్రైం/వేములవాడఅర్బన్/బోయినపల్లి(వేములవాడ): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌కి చెందిన మొహ్మద్ అలీ, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన రజిత పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. మనసులు కలిస్తే చాలు.. మతాలు అవసరం లేదని భావించారు. వారిప్రేమకు గుర్తుగా ముగ్గురు సంతానం కలిగారు. మద్యం మహమ్మారి ఫ్యామిలీలో చిచ్చుపెట్టింది. డబ్బుల కోసం భర్త అలీ తరచూ రజితను వేధించాడు. మూడు రోజుల క్రితం పైసలు తీసుకొస్తేనే ఇంటికి రావాలని పుట్టింట్లో దించి వెళ్లాడు. తల్లిదండ్రులు కూడా తమ వద్ద డబ్బులు లేవని రజితకు చెప్పి.. భర్త వద్దకు వెళ్లాలని సూచించారు. తను ఉండగానే పిల్లలను పట్టించుకోని భర్త..తను చనిపోతే ఏం చూసుకుంటాడని భావించిందో ఏమో అటు భర్త వద్దకు వెళ్లలేక.. ఇటు పుట్టింట్లో ఉండలేక ముగ్గురు పిల్లలతో కలిసి బోయినపల్లి మండలంలోని కొదురుపాక ఫోర్‌లేన్ బ్రిడ్జి వద్ద మిడ్‌మానేరులో దూకి ప్రాణాలు తీసుకుంది. మృతులు రజిత, ఆమె కుమారులు మొహమ్మద్ అయాన్ (7), అసర జబీన్ (5) ఉస్మాన్ అహ్మద్ (14 నెలలు)గా పోలీసులు గుర్తించారు.

దైవదర్శనం కోసం వచ్చి..



సాయికుమార్(ఫైల్)



శ్రీనాథ్ (ఫైల్)

జమ్మికుంట(హుజూరాబాద్)/గోదావరిఖని: దైవదర్శనం కోసం వచ్చిన ఇద్దరు యువకులు కోనేరులో స్నానానికని వెళ్లి నీటమునిగి ప్రాణాలు వదిలారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ దర్గా సమీపంలో ఈ ఘటన జరిగింది. బక్రీద్ పర్వదినం సందర్భంగా గురువారం రాత్రి పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన 12 మంది యువకులు నాలుగు బైక్‌ల మీద దర్గాకు వచ్చారు. సందల్ ఉత్సవంలో పాల్గొని శుక్రవారం తెల్లవారుజామున శ్రీనాథ్ కొత్త బైక్ పూజ చేయించాలని మిగతా ఫ్రెండ్స్‌తో కలిసి గుట్టపై ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వెళ్లారు. అనంతరం సమీపంలోని కోనేరులో స్నానానికని దిగారు. వీరిలో ఏడుగురు మెట్లపై ఉండి స్నానం చేసి పైకి రాగా.. సాయికుమార్(24), శ్రీనాథ్(19) కోనేరులోకి దిగారు. ఈత రాకపోవడంతో శ్రీనాథ్, సాయికుమార్ నీటమునిగి చనిపోయారు.

కమ్మేసిన నిద్రమత్తు..



దుర్గయ్య(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి తిరిగివస్తుండగా కారు నడుపుతున్న సునీల్‌ను నిద్ర ఆవహించడంతో అదుపు తప్పి పక్కనే విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు గంట దుర్గయ్య(45) మృతిచెందాడు. స్నేహితుడు మస్కూరి అశోక్ భార్యను హైదరాబాద్‌లోని పుట్టింట్లో దింపి తిరిగి వస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న గంట దుర్గయ్య, మస్కూరి అశోక్, రేసు శ్రీమాన్, ఊషి సునీల్ గాయపడ్డారు. దుర్గయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేటకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. దుర్గయ్య మృతితో అతని భార్య రేణుక, కూతుళ్లు అక్షిత, ఆకాంక్ష, కుమారుడు శ్రీకర్ రోడ్డున పడ్డారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి గీతకార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. క్షతగాత్రులను పరామర్శించారు.

కూతురిని చూసి వస్తుండగా..



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, మేకల నరేందర్ (ఫైల్)

వేములవాడ/వేములవాడరూరల్ : వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లిలో శుక్రవారం టిప్పర్ ఢీకొని కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన వీఆర్ఏ మేకల నరేందర్(40) అక్కడికక్కడే మృతిచెందాడు. వేములవాడ శివారులోని గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతున్న తన కూతురును చూసి, పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరయ్యాడు. అక్కడి నుంచి బోయినపల్లి మండలం దుంద్రపల్లిలోని అత్తగారింటికి వెళ్లాడు. అక్కడి నుంచి బావబావమరుదులు చెరో బండిపై వేములవాడకు బయలుదేరారు. శాత్రాజుపల్లి దాటగానే వెనుక నుంచి వచ్చిన టిప్పర్ నరేందర్ బైక్‌ను ఢీకొట్టింది. టిప్పర్ టైర్ ఎక్కడంతో నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. కొద్ది దూరం నుంచి బావమరిది నాగరాజు ప్రమాద స్థలానికి చేరుకోగానే తన బావే అని తెలుసుకొని గుండెలవిసేలా రోదించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య వినోద, ఇద్దరు కూతుళ్లు లత, లయ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుస్తకాలు కొనేందుకు వెళ్లి..



కారుపాలక సతీశ్ మృతదేహం

కమాన్‌పూర్(రామగిరి):రామగిరి మండలం మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి ఇసుక లారీ ఢీకొని తండ్రి మృతిచెందగా కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని లొంకకేసారం గ్రామానికి చెందిన కారుపాకల సతీశ్(37) ఓసీపీ–2లో కాంట్రాక్టు కార్మికుడు. ద్విచక్రవాహనంపై తనకొడుకు సిద్దూ(6)తో కలిసి సెంటినరీకాలనీకి వెళ్లాడు. పుస్తకాలు కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా పెద్దపల్లి వైపు వెళ్తున్న ఇసుకలారీ ఢీకొంది. ద్విచక్ర వాహనంపై ఉన్న సతీశ్‌ను కొంతదూరం లాక్కెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందగా, సిద్దూకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సతీశ్ కుటుంబ సభ్యులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.సీఐలు సతీశ్, వేణుగోపాల్, ఎస్సైలు రవిప్రసాద్, వెంకటేశ్వర్లు, రాములు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా.. కుటుంబ సభ్యుల ఆందోళన కొనసాగుతోంది.

చిన్నారిని చిదిమేసిన బైక్



మృతి చెందిన జయాన్స్‌రెడ్డి

సైదాపూర్(హుస్నాబాద్): కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలానికి చెందిన ఓ చిన్నారిని బైక్ చిదిమేసింది. ఎస్సై ఆరోగ్యం తెలిపిన వివరాలు. మండలంలోని దుద్దెనపల్లికి చెందిన చాడ సంపత్‌రెడ్డి కుమారుడు జయాన్స్‌రెడ్డి(3) ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన చిన్నయాలం దేవేందర్‌రెడ్డి బైక్‌పై వస్తూ చిన్నారిని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలవడంతో బాలుడిని హుజూరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ జయాన్స్‌రెడ్డి మృతి చెందాడు. కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

ధర్మపురి లయన్స్ క్లబ్‌కు మైల్‌స్టోన్ అవార్డు



ధర్మపురి: 2022–2023 సంవత్సరానికి గాను 320–జి రీజియన్‌లో అత్యధిక మంది సభ్యులను చేర్పినందుకు ధర్మపురి లయన్స్ క్లబ్‌ను మైల్‌స్టోన్ అవార్డు వరించింది. పట్టణంలో క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా మొదటి వైస్ గవర్నర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అప్పటి క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణకు అవార్డు అందజేశారు. జిల్లా కార్యదర్శి మధుసూదన్, రెండో కార్యదర్శి రమణారెడ్డి, ఆర్‌సీ రాజయ్య, జోనల్ చైర్మన్ అశోక్ తదితరులున్నారు.

మహిళ ఆత్మహత్య

పెగడపల్లి(ధర్మపురి): మండలంలోని రామబద్రునిపల్లి గ్రామానికి చెందిన బొజ్జ మల్లవ్వ (57) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సీహెచ్.సతీశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మల్లవ్వ కొంతకాలంగా కడుపునొప్పి, ఇతర అనారోగ్య సమస్యలతో బాధ పడుతోంది. ఆస్పత్రులకు వెళ్లి, మందులు వాడుతున్నా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, శుక్రవారం ఇంట్లోనే ఉరేసుకుంది. మృతురాలి కుమారుడు శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

వైద్యులు.. దైవదూతలు





కోవిడ్-19 గర్భిణికి పురుడు పోసిన వైద్య బృందం, తల్లిదండ్రులతోపాటు డాక్టర్ సాయినాథ్‌రెడ్డికి బియ్యం ఇస్తున్న రాయమల్లు (ఫైల్)

- ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న అనేక వైరస్‌లపై పోరాటం
- రోగుల ప్రాణాలు కాపాడుతున్న వైనం
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

కోల్‌సిటీ(రామగుండం): 'ఏం పర్లేదు.. భయపడాల్సిందేమీ లేదు.. తగ్గిపోతుందంటూ.. రోగుల్లో ఆశను రేకెత్తించే వ్యక్తే డాక్టర్. తల్లిదండ్రులు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తున్నారు. దైవ మానవ అవతారమే వైద్యుడు. చదువులకు సరస్వతి, ధనానికి లక్ష్మీ దేవతలను పూజించినట్లు... ప్రాణం కోసం మహావిష్ణువు ధన్వంతరి అవతారాన్ని ఎత్తాడని పెద్దలు చెబుతుంటారు. 'వైద్యో నారాయణో హరి'కి నిలువెత్తు నిదర్శనంగా కొందరు డాక్టర్లు సేవాభావంతో రోగులకు ప్రాణం పోస్తున్నారు. ప్రతీ కేసును సవాల్‌గా తీసుకుంటున్నారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న అనేక వైరస్‌లపై పోరాటం చేస్తూ, తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలు కాపాడుతున్నారు. ఏటా జూలై 1వ తేదీని మన దేశంలో 'జాతీయ వైద్యుల దినోత్సవం'గా జరుపుకుంటున్నాం.

డాక్టర్స్ డే నేపథ్యం ఇదీ..

భారతీయ వైద్య రంగంలో వ్యక్తిత్వంతోపాటు అన్ని తరాలకు ఆదర్శంగా నిలిచిన డాక్టర్ బీసీ రాయ్ జయంతిని ఏటా జూలై 1న నిర్వహిస్తున్నారు. ఇదే రోజున డాక్టర్స్ డే కూడా జరుపుతున్నారు. స్వాతంత్య్ర సమరయోధుడిగా, విద్యావేత్తగా, సంఘ సంస్కర్తగా.. నిరుపేదలకు ఆపన్న నేస్తంగా వైద్య సేవలందించిన వైద్యుడిగా రాయ్ సుపరిచితులు. 1882లో జూలై 1న జన్మించిన ఆయన కోల్‌కతా, ఇంగ్లండ్‌లలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. వైద్యుడిగా సేవలందిస్తూనే రాజకీయ రంగంలో అరంగేట్రం చేసి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా 12 ఏళ్లపాటు పని చేశారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలోనూ ఆయన రోగులకు నిత్యం ఓ గంటపాటు సేవలందించేవారు. 1991లో ప్రభుత్వం రాయ్‌కి భారతరత్న అవార్డు ప్రదానం చేసింది. 1962 జూలై 2న ఆయన మృతిచెందారు.

ఇళ్లలో డాక్టర్ సాయినాథ్‌రెడ్డి ఫొటోలు..

సృష్టికి ప్రతిసృష్టిగా నిలిచిన వైద్యులు రోగుల బాధలను తమ స్టెతస్కోప్‌తో గుర్తిస్తున్నారు. ధరణిపై దేవతలుగా డాక్టర్లను కొలుస్తున్న కొందరు రోగులు.. వారి ఫొటోలను ఇళ్లలో పెట్టుకొని, పూజలు చేస్తున్నారు. గోదావరిఖనిలో దివంగత డాక్టర్ సాయినాథ్‌రెడ్డి ప్రజల బాధలను మాత్రలతో కాకుండా, మనసుతో తెలుసుకొని, వారికి దగ్గరయ్యారు. అందుకే ఇప్పటికీ ఆయన ఫొటోను పలువురు ఇళ్లలో పెట్టుకున్నారు. మరణించిన తల్లిదండ్రులతోపాటు ప్రాణం పోసిన డాక్టర్‌సాయినాథ్‌రెడ్డికి సింగరేణి మాజీ కార్మికుడు కడమండ రాయమల్లు ఏటా పెతర అమావాస్య రోజు బియ్యం ఇస్తూ అభిమానాన్ని చాటుకుంటున్నాడు.

'ఉపాధి' గుంతలను పూడ్చితే కేసులు



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్డీవో లక్ష్మీనారాయణ

కథలాపూర్(వేములవాడ): ఉపాధిహామీ పథకంలో లక్షలాది రూపాయలు వెచ్చించి, తవ్వించిన కందకాలు, మొక్కల నాటేందుకు తీసిన గుంతలను పూడ్చితే బాధ్యులపై కేసులు నమోదు చేయిస్తామని డీఆర్డీవో లక్ష్మీనారాయణ హెచ్చరించారు. శుక్రవారం కథలాపూర్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2020 సంవత్సరం ఫిబ్రవరి నెల నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు మండలంలో ఉపాధిహామీ పథకంలో రూ.12 కోట్ల పనులు చేపట్టారు. వీటికి సంబంధించి సామాజిక తనిఖీ చేపట్టారు. గ్రామాలవారీగా చేసిన పనుల్లో లోపాలను అధికారులు గుర్తించగా.. వాటికి స్థానిక అధికారులు వివరణ ఇచ్చారు. పలు గ్రామాల్లో రోడ్ల పక్కన కందకాలు తవ్వించగా వాటిని పూడ్చివేశారని, బాధ్యులను గుర్తించి, నోటీసులు ఇవ్వాలన్నారు. చింతకుంటలో సుమారు రూ.3 లక్షలతో తవ్వించిన కందకాలు కనిపించక పోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు వాటిని పూడ్చివేసి, చదును చేశారని అప్పట్లోనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కార్యదర్శి మోహన్ తెలిపారు. రాజారాం తండాలో మొక్కల కోసం తవ్విన గుంతలను పూడ్చి, చదును చేసినట్లు గుర్తించారు. పనుల్లో నిర్లక్ష్యం, కూలీల వివరాల నమోదు, వేతనాల చెల్లింపులో తేడా కారణంగా ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు రూ.1.64 లక్షలు చెల్లించాలని అధికారులు ఆదేశించారు. కాగా రెండేళ్ల క్రితం జరిగిన మట్టి పనులకు తమను బాధ్యులు చేయడంపై పలువురు సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో బాలె శివాజీ, క్వాలిటీ అధికారి రాజేంద్రప్రసాద్, అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, విజిలెన్స్ అధికారులు చిన్నయ్య, దేవేందర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ మహేశ్, ఎంపీడీవో జనార్దన్, ఏపీవోలు రాజేందర్, సతీశ్, ఈసీ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి డ్రైవర్ మృతి



శ్రీనివాస్ మృతదేహం

ధర్మపురి: ట్రాక్టర్ పైనుంచి పడి, ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై దత్తాత్రి తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మపురి మండలంలోని దొంతాపూర్ గ్రామానికి చెందిన జక్కి శ్రీనివాస్(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం సాయంత్రం ట్రాక్టర్ ద్వారా మొరం తీసుకెళ్లే పనులు చేస్తున్నాడు. ఈ క్రమంలో ట్రాక్టర్ దారిలో ఒకవైపు వంగిపోయింది. శ్రీనివాస్ కిందపడగా తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబసభ్యులు జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతిచెందాడు. శుక్రవారం మృతుడి భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఇద్దరూ చిన్నపిల్లలు, రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబం కావడంతో గ్రామస్తులు సుమారు రూ.25 వేల చందాలు వేసుకొని, దహన సంస్కారాలు జరిపించారు. శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ రామచంద్రం, ఎంపీటీసీ సభ్యురాలు రాంటెంకి చందన కోరారు.

గోమాతను వధిస్తుంటే ఊరుకుంటారా?

- ఎంపీ బండి సంజయ్‌కుమార్

ధర్మపురి: ధర్మపురిలో గోమాతను వధిస్తుంటే చూస్తూ ఊరుకోవడమే కాకుండా ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేస్తారా అంటూ పోలీసుల తీరుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. ధర్మపురి పట్టణంలో గురువారం జరిగిన బక్రీద్ వేడుకల సందర్భంగా కొందరు గోమాతలను వధించారని, ఇది చట్టరీత్యా నేరమన్నారు. దీనిపై పట్టణంలో స్వచ్ఛందంగా, శాంతియుతంగా బంద్ పాటించినవారిని పోలీసులు అరెస్టు చేయడం ఏంటని ప్రశ్నించారు. వారిని వదిలిపెట్టకపోతే తానే ధర్మపురికి వస్తానని హెచ్చరించారు. గోమాతను వధించానని పోలీసుల ముందే చెప్పిన కౌన్సిలర్‌పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తాను హిందువునని పదే పదే చెప్పుకునే ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ విషయంపై ఎందుకు స్పందించడం లేదో చెప్పాలన్నారు.

రజకుల శాశ్వత ఉపాధికి బాటలు



శ్రీనివాస్

సిరిసిల్ల: రాష్ట్రంలోని రజకులకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తోందని రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంస్థల్లో బట్టలు ఉతికే కాంట్రాక్టులను రజకులకే ఇవ్వాలని నిర్దేశిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. రాష్ట్రంలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల హాస్టల్స్, స్పోర్ట్స్ హాస్టల్స్, దేవాదాయశాఖ ఆలయాలు, ఆర్అండ్‌బీ అతిథి గృహాలు, పోలీస్‌హెడ్‌క్వార్టర్, ప్రాంతీయ ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, బోధనాస్పత్రుల్లో రజకుల వృత్తిపై ఆధారపడిన వారికే కాంట్రాక్టులు ఇవ్వాలని జీవోలో స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఇలాంటి జీవోలు లేక రజక కులవృత్తితో సంబంధం లేని వ్యక్తులు బట్టలు ఉతికే కాంట్రాక్టులు పొంది.. రజకులతోనే పనిచేయిస్తూ శ్రమదోపిడీకి పాల్పడేవారిని శ్రీనివాస్ వివరించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోతో రాష్ట్రంలోని రజకులకు దీర్ఘకాలిక ఉపాధికి బాటలు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే కులవృత్తులపై ఆధారపడిన వారికి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ రజకులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వసంస్థల్లో బట్టలు ఉతికే కాంట్రాక్టులు రజకులకు మాత్రమే ఇవ్వాలని జీవో జారీచేసిన సీఎం కేసీఆర్‌కు, కృషి చేసిన మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

భార్యను చంపిన భర్తకు యావజ్జీవ శిక్ష

జగిత్యాలజోన్: భార్యను చంపిన భర్తకు యావజ్జీవ శిక్షతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. సారంగాపూర్ మండలంలోని రేచపల్లి అనుబంధ గ్రామం భీమ్యానాయక్ తండాకు చెందిన భూక్య మోతీలాల్‌తో కనకవ్వకు 30 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. దంపతులు కూలి పని చేసుకుంటూ పిల్లలను పోషించుకునేవారు. ఈ క్రమంలో కనకవ్వకు ఇతరులతో అక్రమ సంబంధం ఉందంటూ భర్త అనుమానం పెంచుకున్నాడు. నిత్యం ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తుండేవాడు. ఏప్రిల్ 5, 2019న సాయంత్రం కనకవ్వ తోటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లింది. ఆమెను ఎలాగైనా చంపాలనుకున్న భర్త మోతీలాల్ ఇప్పటిదాకా ఎక్కడికి వెళ్లావంటూ బండ రాయితో దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కనకవ్వ అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు సంఘటన స్థలానికి చేరుకోగానే మోతీలాల్ పారిపోయాడు. బాధితురాలిని కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేయగా అప్పటి సీఐ రాజేశ్ దర్యాప్తు పూర్తి చేశారు. మోతీలాల్‌ను అరెస్టు చేసి, కోర్టులో చార్జిషీట్ వేశారు. కోర్టు మానిటరింగ్ బృందం సభ్యులు ఎం.కిరణ్‌కుమార్, జి.రామకృష్ణ సాక్షులను ప్రవేశపెట్టారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నీలిమ మోతీలాల్‌కు శుక్రవారం శిక్ష ఖరారు చేశారు.